బాధ్యతగా పన్నులు కట్టండి

మేడ్చల్: ప్రజలందరూ బాధ్యతగా తమ ఆస్తి పన్నులు మున్సిపాలిటీకి చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మేడ్చల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలు విధిగా పన్నులు చెల్లిస్తే పట్టణ అభివృద్ధికి నిధులు సమకూరుతాయని, రూ.11 కోట్ల పన్నులు బకాయి ఉండగా రూ.4 కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. పట్టణంలోని వాణిజ్య, వ్యాపార కేంద్రాల వారు ఏ ఏడాది పన్నులు ఆ ఏడాదే చెల్లించాలని కోరారు. తమ వద్దకు వచ్చే బిల్ కలెక్టర్లకు, లేదంటే ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించాలని ఆమె కోరారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ కావేరి

ఘట్‌కేసర్: ఇటీవల మరణించిన అవుషాపూర్ వాసి అశోక్‌గౌడ్ కుటుంబీకులకు సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి శనివారం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్లేశ్, రవి నాయక్, మశ్చేందర్‌రెడ్డి, బిక్షపతి, కె.వెంకటేశ్‌గౌడ్, జి.వెంకటేశ్‌గౌడ్, అజయ్య పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

మేడ్చల్: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, తపస్ బలపరిచిన అభ్యర్థి తరుపున మండల బీజేపీ నాయకులు పట్టణంలోని వివిధ కాలనీల్లో నివాసముంటున్న ఉపాధ్యాయులను కలిసి ప్రచారం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కళాశాలలో బీజేపీ నాయకులు టీచర్లను కలిసి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అర్జున్, జాకట ప్రేమ్‌దాస్, రాఘవ రెడ్డి, వంశీ, సాయి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఆ స్థానంపై అధికార పార్టీల కన్ను!



ఉమ్మడిగా ఉన్నప్పుడు టీడీపీ.. గతంలో, ప్రస్తుతం అధికారంలో కాంగ్రెస్ పార్టీ

ఈ సారి ఎలాగైనా గెలవాలని కారు, కమలం పార్టీల వ్యూహం

మురళీధర్‌రావును దింపేందుకు బీజేపీ

ఎవరిని దింపాలో.. అనే ఆలోచనలో బీఆర్ఎస్


కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్నా.. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని గెలవలేని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు

మేడ్చల్: కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు బీజేపీ, బీఆర్ఎస్‌లకు అందని ద్రాక్షగా ఉన్న మల్కాజ్‌గిరి ఎంపీ స్థానం వచ్చే ఎన్నికల్లో ఎలగైనా సాధించాలనే పట్టుదలతో రెండు పార్టీలు బలమైన నేతలను రంగంలోకి దించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాయి. పార్లమెంటు నియోజకవర్గంగా ఏర్పడినప్పటి నుంచి ఈ రెండు పార్టీలు ఈ సీటును గెలవలేదు. మూడు సార్లు కాంగ్రెస్, ఒకసారి టీడీపీ మల్కాజ్‌గిరి ఎంపీ సీటును గెలిచాయి. పునర్విభజనలో ఏర్పడ్డ ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ వరుసగా రెండుసార్లు గెలిచారు. మూడో సారి జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి మల్లారెడ్డి టీడీపీ నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. నాల్గో సారి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ పార్లమెంటు స్థానంలో గెలిచారు.

మల్కాజిగిరి ఎంపీ స్థానానికి మురళీధర్‌రావు..



అధికంగా ఉత్తర భారతీయ ఓటర్లు, అధిక శాతం హైదరాబాద్ నగర ఓటర్లు ఉన్న మల్కాజిగిరి పార్లమెంటు సీటును ఎలాగైనా రాబోయే ఎన్నికల్లో గెలవాలనే పట్టుదలతో బీజేపీ ఉన్నట్లు కనిపిస్తోంది. ఎన్నో రాష్ట్రాలకు ఇన్‌చార్జిగా పని చేసి బీజేపీని గెలిపించిన పార్టీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావును మల్కాజ్‌గిరి నుంచి బరిలో దింపుతున్నట్లు సమాచారం. మల్కాజ్‌గిరి పార్లమెంట్‌కు ఎలాంటి సంబంధం లేని మురళీధర్‌రావు తరుచూ నియోజకవర్గ పరిధిలోని వివిధ సెగ్మెంట్లలో తన పేరుపై కార్యక్రమాలు నిర్వహిస్తూ పట్టు కోసం యత్నాలు చేస్తున్నారు. గత డిసెంబర్‌లో డబీల్‌పూర్ ఇస్కాన్ మందిరంలో మురళీధర్‌రావు నేతృత్వంలో గవర్నర్ తమిళిసైని రప్పించి హోమాలు నిర్వహించి అందరినీ అక్కడకు పిలిచారు. రెండు నెలల క్రితం కుత్బుల్లాపూర్ ఉత్తర భారతీయులతో కార్యక్రమం నిర్వహించారు. తాజాగా డబీల్‌పూర్‌లో గోదావరి హారతి కార్యక్రమాలను చేపట్టారు. ఇలా ఏదో ఒక కార్యక్రమం చేస్తూ ఈ జాతీయ నేత హల్‌చల్ చేస్తున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేస్తారని బీజేపీ కార్యకర్తలు చెబుతున్నారు.



మేడ్చల్ నుంచి కేఎల్ఆర్..

మేడ్చల్‌లో బీజేపీకి కాస్తో..కూస్తో.. పట్టున్నప్పటికీ బలమైన నాయకుడు ఆ పార్టీలో కనబడటం లేదు. అర్థ బలం, ప్రజా బలం ఉన్న నాయకుడు లేకపోవడంతో ఆ పార్టీ బలమైన అభ్యర్థి వేటలో ఉంది. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఎన్నిక కావడంతో నాటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్న మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌ను పార్టీలోకి చేర్చుకుని మేడ్చల్ నుంచి పోటీకి దింపాలని పార్టీ పెద్దలు యోచిస్తున్నట్లు సమాచారం. కేఎల్ఆర్‌తో పలు దఫాలు చర్చలు చేశారని ఆయన రెండు, మూడు నెలల్లో పార్టీలో చేరతారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

రాజన్న ఉంటారో...

గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఈ సారి ఆ పార్టీ టికెట్టు ఇస్తుందో..లేదో.. అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఆయన ఓడినప్పటికీ ఆయనకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిని ఆ పార్టీ అధిష్టానం ఇచ్చినా.. ఆయన పూర్తిగా నియోజకవర్గంలోని అన్ని సెగ్మెంట్లలో కనిపించలేదు. కేవలం మేడ్చల్‌కు పరిమితమయ్యారు. తరుచూ మంత్రి కేటీఆర్, సీఎం కేసీఆర్‌లతో టచ్‌లో ఉన్నప్పటికీ ఎదుటి పార్టీలు బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలనే వ్యూహంతో ఉండటంతో బీఆర్ఎస్ నుంచి ఎవరూ రంగంలో ఉంటారనే ప్రశ్నకు ఇప్పుడు సమాధానం దొరకడం కష్టమే.

బీఆర్ఎస్ పాలనలో మహిళాభివృద్ధికి పెద్దపీట


మహిళలతో కలిసి కేక్‌ను కట్ చేయిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సీఎం కేసీఆర్ మహిళాభివృద్ధికి పెద్దపీట వేయడం జరుగుతోందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం కీసరలో నిర్వహించిన మహిళాదినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్, బాలికల కోసం గురుకుల పాఠశాలలు, స్థానిక సంస్థలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందన్నారు. ముఖ్యంగా మహిళల రక్షణకు షీటీమ్స్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఎక్కువ శాతం మహిళలకు లబ్ధి చేకూర్చేవే అని అన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని సంక్షేమ పథకాలను మహిళల కోసం అమలు చేస్తామన్నారు. అనంతరం గ్రామస్తులందరి సమక్షంలో కేక్‌కట్ చేసిన మంత్రి మల్లారెడ్డి మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మల్లారెడ్డి హెల్త్ యూనివర్సిటీ చైర్మన్ చామకూర ప్రీతిరెడ్డి, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, సర్పంచులు నాయకపు మాధురివెంకటేష్, గరుగుల అండాలు, మోర విమల, ఎంపీటీసీలు పండుగ కవిత, నారాయణశర్మ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, మహిళా వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సృష్టికి మూలం మహిళే..

ఘట్‌కేసర్: సృష్టికి మూలం మహిళ అని, మహిళలు లేనిది ప్రపంచమే లేదని చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం కౌన్సిలర్ వసంతతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలకు ఆమె ముఖ్యఅతిథులుగా హాజరై మహిళా వైద్యులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు శారద, మాలతి, రజనీ, హెడ్ నర్సులు శమంతక మణి, జానకీ, వసంత, నర్సులు లక్ష్మీకుమారి, అనిత, భాగ్య, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ ప్రభుత్వాస్పత్రిలో జరిగిన వేడుకలో పావనీయాదవ్

మల్లారెడ్డి ట్రస్టు సేవలు అభినందనీయం


ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ మహేందర్‌రెడ్డి

కీసర: గ్రామాల్లో అనారోగ్యం కారణాలతో మృతి చెందుతున్న కుటుంబాలకు మంత్రి మల్లారెడ్డి తమ మల్లారెడ్డి ట్రస్టు ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమని గోధుమకుంట గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి అన్నారు. గోధమకుంట గ్రామంలో శనివారం చీర ముత్తమ్మ, యమ్మ సత్తమ్మ కుటుంబాలకు మల్లారెడ్డి ట్రస్టు ద్వారా అందజేసిన రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయంగా నగదును సర్పంచ్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వంగేటి పర్వత్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు చీరకృష్ణ, నాయకులు పుట్ట రమేష్‌గౌడ్, చీర మహేష్, పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కు ఇస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని ఎస్సీకాలనీకి చెందిన కుమార్‌కు రూ.37,500, రాంపల్లిచౌరస్తాకు చెందిన హంసవ్వకు రూ.13వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, నాయకులు శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం సుతారిగూడ గ్రామంలో పర్యటించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామ సర్వే నిర్వహించి గ్రామంలోని సమస్యలు తెలుసుకోవడంతో పాటు గ్రామస్తులకు ప్లకార్డులు ప్రదర్శించి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే ఈ-శ్రమ్ కార్డులు అందజేత


కార్డులు అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: పేదల సంక్షేమం కోసం కేంద్రం ఈ శ్రమ్ కార్డులు అందజేస్తోందని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తోందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. అవుషాపూర్‌లోని శ్రామికులకు సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డితో కలిసి శనివారం ఈ-శ్రమ్ కార్డులు పంపిణీ చేశారు. అలాగే ఆయుష్మాన్ భారత్ పథకంలో పేదల పేర్లు నమోదు చేయించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు రవినాయక్, మశ్చేందర్‌రెడ్డి, జి.వెంకటేశ్‌గౌడ్, కె.వెంకటేశ్‌గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా మారాలి

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థుల ప్రయాణం సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసి ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రాష్ట్ర ఐటీ శాఖ కమిషనర్ జీవన్‌లాల్ లవిదియా మాట్లాడుతూ.. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొని దృఢంగా నిలబడే సత్తా ఇంజినీర్లకు ఉంటుందన్నారు. అంతకుముందు టెక్‌మహీంద్రా జీఎం నర్సింహ, పాత్ క్రియేటర్స్ ఎండీ అశిష్‌లు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రెటరీ త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు, ప్రిన్సిపాల్ లోకనాథం, కృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి కళాశాలలో 'బలగం' చిత్ర బృందం సందడి



సాక్షి, సిటీబ్యూరో: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బలగం చిత్ర బృందం సందడి చేశారు. కళాశాలకు చెందిన విద్యార్థులు గణేశ్, రాహుల్, గంగాధర్ చిత్రీకరించిన 'ధనం మూలం ఇదం జగత్' వెబ్ సిరీస్ మొదటి భాగాన్ని బలగం చిత్ర దర్శకుడు వేణు టిల్లు, హీరో ప్రియదర్శిలు ముఖ్య అతిథులుగా పాల్గొని యూట్యూబ్ ఛానల్ ద్వారా విడుదల చేశారు. తమ వెబ్‌సిరీస్ చిత్రీకరణకు సహకారం అందించిన కళాశాల ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, అధ్యాపకురాలు హేమలతలకు దర్శకుడు గణేశ్ ధన్యవాదాలు తెలిపారు.


ముగిసిన అక్షర 2కే23

కళాశాలలో రెండ్రోజుల పాటు కొనసాగిన అక్షర 2కే23 టెక్నికల్ ఫెస్ట్ శనివారం ముగిసింది. ముగింపు సభలో బలగం చిత్ర బందం పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకోవాలి


మేడ్చల్: విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకుని విద్యార్థులు తమ జీవితంలో ఉన్నతులుగా రాణించాలని మేడ్చల్ సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం న్యాయమూర్తి అజయ్‌కుమార్ జాదవ్ అన్నారు. పట్టణంలోని స్ఫూర్తి కళాశాల నిర్వహించిన ఫేర్ వెల్‌డే ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కమలాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దేవరాజు, డైరెక్టర్లు మంజుల ప్రకాష్, గణేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏయూ వార్షికోత్సవం



ఘట్‌కేసర్: వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ) వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాల్లో రాణించాలన్నారు. ప్రధానంగా చెడు మార్గాలకు దూరంగా ఉంటూ జీవిత లక్ష్యాన్ని చేరుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. అనంతరం పలు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సీఈఓ నీలిమా, ఉప కుపలపతి రాంచంద్రం, రిజిస్ట్రార్ సమీనా ఫాతిమా, డీన్స్, హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


ప్రియాంక

జవహర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సీతారాం వివరాల ప్రకారం.. అల్వాల్ మండల యాప్రాల్‌ని సాయికృపా కాలనీలో నివాసముండే దురువాసులుకు ఐదుగురు కుమార్తెలు వీరిలో 4వ కుమార్తె ప్రియాంక(30) 2017లో వివాహం చేసుకుని గత నెలలో విడాకులు తీసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రియాంక తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం సమీప ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ బాలికను వలపన్ని లోబర్చుకున్న వ్యక్తి రిమాండ్


నిందితుడు సద్దాం హుస్సేన్

సాక్షి, సిటీబ్యూరో: మైనర్ బాలికను వలపన్ని తనతో పాటు తీసుకెళ్లిన వ్యక్తిని పోలీసులు శనివారం రిమాండ్ చేశారు. మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం అస్సాం రాష్ట్రానికి చెందిన సద్దాం హుస్సేన్(22) రాజబొల్లారంలోని ఓ ప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అదే కంపెనీలో పనిచేసే 16 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో వలపన్ని తనతో పాటు తీసుకెళ్లాడు. బాలిక తండ్రి ఫిర్యాదుతో గుంటూరు రైల్వే స్టేషన్‌లో అతడిని అదుపులోకి తీసుకొని మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ అనంతరం రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.